
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7। కనిష్ఠం 18.3



నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 2 మార్చి 2024

## 3న మహిళల ఆత్మరక్షణపై అవగాహన సదస్సు

నిజామాబాద్ లీగల్, మార్చి 1: మహిళల ఆత్మరక్షణపై ఆదివారం నగరంలోని గిరిరాజ్ కళాశాలలో అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ సదస్సులో పాఠశాల, కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగినులతో పాటు ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న మహిళలందరూ పాల్గొనాలని ఆమె కోరారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు

## అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- ప్రజాపాలన సేవ కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి
- వీసీలో సీఎస్ శాంతికుమారి

నిజామాబాద్ అర్బన్, మార్చి 1: రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హత కలిగిన వారందరూ ప్రయోజనం పొందేలా అన్ని ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్, వార్డు ఆఫీసులలో ప్రజాపాలన సేవ కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. డీజీపీ రవిగుప్తతో కలిసి శుక్రవారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన వారితో పాటు దరఖాస్తులలో సరైన వివరాలు నమోదు చేయనివారి కోసం ప్రజాపాలన సేవ కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటైన పలు మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాలు లేనందున తహసీల్దార్ కార్యాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్నెట్ సదుపాయాలతోపాటు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలన్నారు. వచ్చే సోమవారం నాటికి అన్నిచోట్ల పనితీరు ప్రారంభం కావాలన్నారు. కార్యాలయాల పనిదినాలలో ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోలేకపోయిన వారికోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా సేవ కేంద్రాల్లో దరఖాస్తును అందుబాటులో ఉంచాలని, సరైన వివరాలు పొందుపర్చలేకపోయిన దరఖాస్తు దారుల వివరాలను సరి చేస్తూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ముఖ్యంగా వంట గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారుడి నెంబర్, రేషన్ కార్డు వివరాలు, మొబైల్ నెంబర్ తదితర వాటిని సరిచేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### పది, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్మీడియెట్‌తో పాటు త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా గట్టి చర్యలు చేపట్టాలని నిర్లక్ష్యానికి తావిస్తూ అక్రమాలకు ఆస్కారం కల్పించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పరీక్షల నిర్వహణ తీరును అనునిత్యం సమీక్షిస్తూ పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, కాపీయింగ్‌కు అవకాశం ఉన్న సెంటర్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించాలని సీపీలు, ఎస్పీలకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ ఐపీఎస్ చైతన్య, డీఈవో దుర్గాప్రసాద్, డీఐఈవో రఘురాజ్, ఆర్టీసీ, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.



# ధరణికి మోక్షం

- జిల్లాలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో 5వేల దరఖాస్తులు
- ఈనెల 9వరకు ప్రత్యేక బృందాల ద్వారా దరఖాస్తుల పరిశీలన
- తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారం
- జిల్లాలో ధరణి కోసం 70 బృందాల నియామకం

నిజామాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధరణి సమస్యలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలో ధరణి సమస్యలపై స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. మండలాల వారీగా ప్రత్యేక బృందాలను నియమించి పరిశీలిస్తున్నారు. ఈనెల 9లోపు ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించడంతో పాటు కానివాటిని నేరుగా దరఖాస్తుదారుడికి సమాచారం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో మెజార్టీ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం నిబంధనలు విడుదల చేసింది. ఈ మూడు స్టేజీల్లో పరిష్కారం కానివాటిని సీసీఎల్ఏ పరిధిలో పరిష్కరించే విధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఎనిమిది రోజులపాటు మండల వారీగా పరిశీలించేందుకు రెవెన్యూతోపాటు ఇతర శాఖల అధికారులను కూడా నియమించారు. గ్రామస్థాయిలో దరఖాస్తుల ఆధారంగా భూములను పరిశీలించి ఎక్కడికక్కడ వాటిని పరిష్కరించడంతోపాటు రైతులకు పాస్‌బుక్కుల్లో మార్పులు చేయనున్నారు.

### నాలుగేళ్ల క్రితం 'ధరణి'

అప్పటి ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ధరణిని తీసుకువచ్చింది. ఆయా గ్రామాల పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్‌ను మండలస్థాయిలో జరిగే విధంగా చేపట్టింది. మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు గ్రామాల్లోని భూములన్నింటికీ కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీచేశారు. ధరణిని కొత్తగా తీసుకువచ్చే సమయంలో వివరాలు ఎంట్రీ చేసేందుకు సమయం తక్కువ ఇవ్వడం వల్ల పలు తప్పులు నమోదు చేశారు. భూముల సర్వేనెంబర్లతో పాటు పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, కుటుంబ సభ్యుల పేర్లతో పాటు భూములకు సంబంధించిన వివరాలను తప్పుగా ఎంట్రీచేశారు. కొన్ని భూములు వ్యవసాయం చేసేవాటిని ప్లాట్లుగా, ఇల్లుగా నమోదు చేశారు. మరికొన్ని భూములను నిషేధిత ఖాతాలో ఎంట్రీ చేశారు. కొన్ని భూములకు సంబంధించి సర్వే నెంబర్లు సక్రమంగా వేసినా విస్తీర్ణం తప్పుగా నమోదు చేశారు. మరొక సర్వే నెంబర్‌లో ఎక్కువ విస్తీర్ణం వేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూములు రైతుల చేతుల్లోనే ఉన్నా వివరాలు వేరొకరి పేరుమీద ఉండడం వల్ల సరిచేసుకునేందుకు నాలుగేళ్లుగా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇక్కడ కానివాటికి సీసీఎల్ఏ వరకు వెళ్లి ప్రయత్నాలు చేశారు.

### ఏళ్ల తరబడి పెండింగ్‌లో..

ధరణిని తీసుకువచ్చేటప్పుడు కిందిస్థాయిలోనే తప్పులు సరిచేసే విధంగా ఆప్షన్‌లు ఇవ్వలేదు. తహసీల్దార్, ఆర్డీవో పరిధిలో ఆప్షన్‌లను ఇవ్వక పోవడం వల్ల అన్ని దరఖాస్తులు కలెక్టర్‌కే వచ్చాయి. కలెక్టర్ పరిధిలో కూడా కొన్ని ఆప్షన్‌లకే అవకాశం ఉండడంతో వాటిని పూర్తిచేశారు. మిగతా వాటికి ఆప్షన్‌లు ఇవ్వక పోవడం వల్ల ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో రైతులు విజ్ఞప్తులు చేసినా ధరణిలో ఆప్షన్‌లు పెంచకపోవడం వల్ల సమస్యలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిపై కొత్త కమిటీని మాజీ మంత్రి కోదండరెడ్డి ఆధ్వర్యంలో నియమించారు. ఈ కమిటీ సభ్యులు పలు దఫాలు ధరణి సమస్యలను పరిష్కరించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లా స్థాయిలోనే తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలో సమస్యలను పరిష్కరించే విధంగా అవకాశం ఇచ్చారు. ఇక్కడ పరిష్కారం కాని కొన్నింటికి మాత్రమే సీసీఎల్ఏ పరిధిలో పరి ష్కరించే విధంగా ధరణిలో మార్పులను చేశారు. స్పెషల్ డ్రైవ్ కింద అన్ని జిల్లాల్లో ప్రత్యేక కమిటీలను నియమించి ఈ నెల 9వరకు సమస్యలన్నీ పరిష్కరించాలని ఆదేశాలను ఇవ్వడంతో జిల్లా అధికారులు వీటిపై దృష్టిపెట్టారు.

### పెండింగ్‌లో 5వేల దరఖాస్తులు

జిల్లాలో ధరణికి సంబంధించిన సమస్యలకోసం దరఖాస్తులు 5వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. మండలాల వారీగా ఆయా గ్రామాల రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని మీసేవ ద్వారా ఈ దర ఖాస్తులను చేశారు. వీటిని పరిష్కరించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. జిల్లాలో మొత్తం 70 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి మండలం పరిధిలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ ఆధ్వర్యంలో మూడు బృందాలను పెద్ద మండలాల్లో, రెండు బృందాలను చిన్న మండలాల్లో ఏర్పాటు చేశారు. వీరికి సహకరించేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, కమ్యూనిటీ సర్వేయర్లు, పారాలీగల్ టీమ్ సభ్యులు, డీఆర్‌డీఏకు చెందిన సిబ్బందిని నియమించారు. అవసరమైన చోట వీరి ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో భూములను పరిష్కరించి తహసీల్దార్ స్థాయిలో వీటిని పూర్తిచేయనున్నారు. ప్రధానంగా మూడు స్టేజీల్లో భూముల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం ఆదేశాలను ఇచ్చింది. తహసీల్దార్ స్థాయిలో నాలుగు విభాగాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరిస్తారు. ఎసైన్డ్ భూములు, వారసత్వ భూములకు సంబంధించిన బదిలీ ప్రక్రియ తహసీల్దార్లు చేయనున్నారు. వెంటనే పాసుపుస్తకాలను కూడా అందిస్తారు. ఇవేకాకుండా జీపీఏ దరఖాస్తులు, భూములకు సంబంధించిన ఖాతాలు ఒకటికన్నా ఎక్కువగా నమోదైన వాటికి తహసీల్దార్ స్థాయిలోనే ఈ స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కరించనున్నారు. ఆర్డీవో స్థాయిలో పాసుపుస్తకాలు లేకుండా వ్యవసాయేతర భూములుగా నమోదైనవి, భూ సేకరణకు సంబంధించిన సమస్యలు, ఎన్‌ఆర్ఐ భూ సమస్యలు, సంస్థల పేరుతో పాసుపుస్తకాలు, కోర్టు కేసుల సమాచారం, పాసుపుస్తకాల్లో తప్పులు నమోదైనవి పరిష్కరిస్తారు. కలెక్టర్ పరిధిలో యాజమాన్య హక్కుల బదిలీ, పాసుపుస్తకాలు లేని వారసత్వ, ఎసైన్డ్ భూముల బదిలీ, నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన దరఖాస్తులు, సెమీ అర్బన్ భూములు, ఇల్లు ఇంటి స్థలాలకు సంబంధించిన వ్యవసాయేతర భూములుగా మార్చిడివి పరిష్కరిస్తారు. ఇవి కాకుండా ఇతర సమస్యలున్న భూములు, 50లక్షలకన్నా అధిక రిజిస్ట్రేషన్ విలువ ఉన్న భూములన్ని సీసీఎల్ఏ స్థాయిలో పరిష్కరిస్తారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈనెల 9వరకు అన్ని గ్రామాల్లో ఉన్న ఈ భూ సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ టీమ్‌లు పనిచేయనున్నాయి. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్పెషల్ డ్రైవ్‌పై సమీక్షించి ఏరోజుకారోజు వివరాలను సీసీఎల్ఏకు పంపించనున్నారు. కాగా, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో అన్ని మండలాల పరిధిలో ధరణికి సంబంధించిన పనుల్లో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు.



# ఆయిల్‌పామ్‌పై ఆసక్తి కరువు!

- సబ్సిడీ అందిస్తున్నా మొగ్గుచూపని రైతులు
- సాగుపై అవగాహన కల్పిస్తున్నా ముందుకురాని వైనం
- సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారుల ప్రయత్నాలు
- జిల్లా వ్యాప్తంగా రెండేళ్లలో 4600 ఎకరాల్లో సాగు

నిజామాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఆయిల్‌పాం సాగు పెంచేందుకు సబ్సిడీని విడుదల చేస్తున్నా రైతులు ఎక్కువగా మొగ్గు చూపడం లేదు. కొత్త పంట కావడం, పరిశ్రమలు ఇంకా ఏర్పాటు చేయకపోవడం వల్ల కొద్దిమంది రైతుల మాత్రమే సాగు చేపట్టారు. తమకున్న భూముల్లో ఈ ఆయిల్‌పాం సాగు మొక్కలను పెడుతున్నారు. రెండేళ్లుగా ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖకు ప్రభుత్వం లక్ష్యాలను ఇస్తున్నా అనుకున్న విధంగా మాత్రం టార్గెట్ కావడం లేదు. అన్ని మండలాల పరిధిలో అవగాహన సదస్సులు పెడుతున్నా ఆదర్శ రైతులు కూడా ఈ సాగువైపు మొగ్గుచూపడం లేదు. నాలుగేళ్లకు పంట చేతికి వచ్చే అవకాశం ఉండడం, అప్పటి వరకు పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే ఇబ్బంది ఉండే పరిస్థితి ఉండడంతో వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. అధికారులు మాత్రం నిర్ణీత లక్ష్యాలను సాధించేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

### రెండేళ్ల క్రితం సాగుకు శ్రీకారం

జిల్లాలో రెండేళ్ల క్రితం ఆయిల్‌పాం సాగుకు శ్రీకారం చుట్టారు. దీనికోసం ఆర్మూర్ మండలం చేపూర్‌లో ప్రత్యేక నర్సరీలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఈ ఆయిల్ పాం సాగుచేసేందుకు అవగాహన కల్పించారు. ఈ సాగు వల్ల అధిక లాభం వస్తుందని రైతులకు వివరించారు. ప్రభుత్వం నుంచి 80నుంచి 100శాతం వరకు ఆయా రైతుల విభాగాలను బట్టి డ్రిప్‌కు సబ్సిడీ వస్తుందని వారికి అవగాహన కల్పించారు. జిల్లాలో 2022-23ఆర్థిక సంవత్సరంలో నాలుగువేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు లక్ష్యంగా మొదలు పెట్టారు. మొదటి సంవత్సరం రైతులకు అవగాహన



కల్పించగా 2600ఎకరాల్లో సాగుచేశారు. రెండో సంవత్సరం 2023-24ఆర్థిక సంవత్సరంలో మళ్లీ 4వేల ఎకరాల్లో సాగుచేయాలని లక్ష్యాన్ని నిర్ణయించారు. ఇప్పటి వరకు 2వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. ఈ పంట దీర్ఘకాలికంగా ఉండడం, ఒకసారి పెడితే పదేళ్ల వరకు పంట వచ్చే అవకాశం ఉండడంతో ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రైతు తమకున్న భూముల్లో కొంతమొత్తంలో ఆయిల్‌పాం సాగుచేస్తే లాభం ఉంటుందని వివరిస్తున్నారు. పంట పెట్టిన మూ డేళ్ల వరకు అంతర్‌పంటలు కూడా సాగు చేసే అవకాశం ఉన్నా ఎక్కువ మంది రైతులు మొగ్గుచూపడం లేదు. ఈ పంట వేసే రైతులకు చేపూర్ నర్సరీ నుంచి మొక్కలను సర ఫరా చేస్తున్నారు. ఎకరాకు 53నుంచి 56మొక్కల వరకు పెడుతున్నారు. ఈ మొక్కల కోసం పెట్టే డ్రిప్‌కు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్‌కు వందశాతం సబ్సిడీ ఇస్తుంది. సన్న, చిన్నకారు రైతులతో పాటు బీసీ రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం సబ్సిడీని డ్రిప్ కు అందిస్తుంది.

### ఖమ్మం జిల్లాలో అధిక సాగు

ఆయిల్‌పాం సాగు ఖమ్మం జిల్లాలో మినహా ఇతర జిల్లాల్లో లేకపోవడం వల్ల ఎక్కువమంది రైతులు మొగ్గుచూపడం లేదు. ఒకసారి పంటచేతికి వచ్చి రైతులకు లాభాలు వస్తే ఎక్కువ మంది సాగుచేసే అవకాశం ఉందని ఉద్యానవన శాఖ అధికారులు భావిస్తున్నారు. జిల్లాతో పాటు నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల కోసం ప్రత్యేక ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ఈ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారు. ఆయిల్‌పాం పంట చేతికి రాగానే కంపెనీ వారే నిర్మల్‌కు కోసి తరలిస్తారు. ఎకరాకు అన్ని ఖర్చులు పోను లక్ష రూపాయల వరకు లాభం ఉంటుందని ఉద్యానవన శాఖ అధికారులు వివరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పంటను పెంచాలని నిర్ణయం తీసుకోవడంతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో గతనెల సమీక్షించి ఎక్కువ మొత్తంలో సాగుపెంచాలని నిర్ణయం తీసుకోవడంతో జిల్లా అధికారులు కూడా వచ్చే మే నుంచి సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి నర్సింగదాస్ తెలిపారు. వచ్చే మే నెల నుంచి సాగు విస్తీర్ణం మరింత పెంచుతామని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని రైతులకు వివరిస్తున్నామన్నారు. ఈ పంట సాగుచేస్తే భవిష్యత్తులో రైతులకు లాభాలు ఉంటాయని ఆయన తెలిపారు.



- బాబ్లీ ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

# బాబ్లీ గేట్ల ఎత్తివేత

- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దిగువకు 0.6టీఎంసీ నీటి విడుదల

మెండోర, మార్చి1: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఎగువ ప్రాంతం మహారాష్ట్రలో గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీప్రాజెక్టు గేట్లను ఎత్తి (0.6టీఎంసీ) నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఏటా మార్చి 1న 0.6 టీఎంసీల నీటిని గోదావరిలోకి విడుదల చేయాలని సుప్రీం కోర్టు తీర్పు మేరకు శుక్రవారం ఉదయం కేంద్ర జల సంఘం ఈఈ వెంకటేశ్వర్లు, ఎస్సారెస్పీ బాబ్లీ ప్రాజెక్టుల అధికారుల ఆధ్వర్యంలో గేట్లను ఎత్తివే శారు. ప్రస్తుతం బాబ్లీ ప్రాజెక్టులో ఎస్సారెస్పీలో పుష్కలంగా నీరు ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. బాబ్లీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిని మట్టం (2.75టీఎంసీ) కాగా ప్రస్తుతం (0.75టీఎంసీ) నీటి నిల్వ ఉందన్నారు. బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి గోదావరిలోకి 0.6టీఎంసీ నీటిని విడుదల చేయగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నీరు సాయంత్రం బాబ్లీప్రాజెక్టు గేట్లను మూసివేసినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ డీఈ గణేష్, ప్రశాంత్, ఏఈఈలు రవి, ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

### పథకాల అమలుతో

# కాంగ్రెస్ శ్రేణుల హర్షం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

భీమ్‌గల్‌రూరల్/కమ్మర్‌పల్లి, మార్చి 1: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ఒకొక్కటిగా అమలు పర్చడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదువందలకే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను శుక్రవారం నుంచి ప్రారంభించడంతో జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



కమ్మర్‌పల్లిలో..



వేల్పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

## ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

కమ్మర్‌పల్లి, మార్చి1: పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు టెంట్లు, తాగు నీరు, మెడికల్ కిట్ల సదుపాయాలు కల్పించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజ శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండంలోని నాగాపూర్ గ్రామశివారులో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో తక్కువ కూలీలు ఉండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అందుకు గల కారణాలపై ఆరా తీశారు. ప్రతీరోజు కనీసం వంద మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఫీల్డు అసిస్టెంట్ రాజేశ్వర్‌ను, పంచాయతీ కార్యదర్శి సంధ్యలను ఆదేశించారు. అయితే మస్టర్‌లో పేర్లు ఉన్న కూలీలు మాత్రమే క్షేత్రస్థాలో ఉపాది పనులకు హాజరుకావాలని సూచించారు. పేర్లు లేనివారు హాజరు కాకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ పర్యావరణం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన వెంట అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్‌లు ఉన్నారు.

## కమ్మర్‌పల్లిలో బోనాల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, మార్చి1: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో శుక్రవారం గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. బోనాల ఊరేగింపు గ్రామ ప్రధాన వీధులు, జాతీయరహదారి గుండా కుడిగుంట చెరువు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రజకుల ఆరాధ్యదైవం మండేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు ఆవుట్ల బాజన్న, కోశాధికారి సుంకెట నర్సయ్య, సుంకెట గంగాధర్, బాజన్న, సుంకెట శ్రీనివాస్, రవి, దశరత్, సుంకెట రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బోనాలను ఊరేగిస్తున్న మహిళలు



దేగాంలో ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో

## క్షయ రహిత జిల్లాగా మారుస్తాం

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం

ఆర్మూర్‌రూరల్, మార్చి1: టీబీని పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా పని చేస్తున్నామని, త్వరలోనే నిజామాబాద్‌ను క్షయ రహిత జిల్లాగా మారుస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలో టీబీ ముక్త్ గ్రామపంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలో 19 గ్రామపంచాయతీలను క్షయరహిత గ్రామాలుగా ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామాల్లోని డేట వెరిఫికేషన్ ఏర్పాటు చేసిన బృందం శుక్రవారం దేగాం గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలో ఉనన డెటాను తనిఖీ చేసి టీబీ శాంపిల్స్‌ను సేకరించిన ఇంటింటికీ వెళ్లి వివరాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి తరుణ్, డాక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవి, శ్రీరాం, సుధాకర్, నాగరాజు, ఉమా మహేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఐఈవో

కోటగిరి, మార్చి1: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘురాజ్ తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా మౌలిక వసతులు కల్పించామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 251 మంది విద్యార్థులను గాను 248 మంది విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్ ఉన్నారు.

**● ఇంటర్ పరీక్షలో ఒకరి డిబార్**

నవీపేట: మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలలో శుక్రవారం ఒకరు డిబార్ అయినట్లు అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా శుక్రవారం మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం పేపర్ నిర్వహించగా 408 మంది విద్యార్థులకు 390 మంది పరీక్షలకు హాజరయ్యారని అధికారులు పేర్కొన్నారు.

### తాగునీటి ఇబ్బందులు కలగకుండా
## ప్రణాళికలు రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

బోధన్ రూరల్, మార్చి 1: మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని బోధన్ ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పర్యటించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవాలని, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, మండల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

### 'జిల్లా అభివృద్ధిని విస్మరించి
## పసుపు ధరపైనే ఎంపీ మాట్లాడటం అవివేకం'



మాట్లాడుతున్న కాటిపల్లి నగేశ్‌రెడ్డి

డిచ్‌పల్లి,మార్చి1: ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లా అభివృద్ధిని విస్మరించి కేవలం పసుపు ధర్నపై గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని, ఐదేళ్లకాలంలో జిల్లా అభివృద్ధికి చిల్లిగవ్వ కేటాయించిన అర్వింద్, ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరీలో జాప్యం చేశాడని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నిజామాబాద్ మార్కెట్‌లో పసుపునకు రూ.17,250 మద్దతు ధర కల్పించిందని గుర్తుచేశారు. మహారాష్ట్రలోని సాం గ్లీ పసుపు మార్కెట్‌కు అప్పటి కలెక్టర్, రైతు ప్రతినిధుల బృందాన్ని మద్దతు ధరకు తీసుకెళ్లారని గుర్తుచేశారు. గడిచిన 10ఏళ్ల కాలంలో నాటి ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత, ఎంపీ అర్వింద్ డిచ్‌పల్లిలో పుట్‌ఓవర్ వం తెన నిర్మిస్తామని చెప్పి తప్పించుకొని తిరిగారని విమర్శించారు. జిల్లా కేంద్రంలో తక్షణమే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కంచెట్టి గంగాధర్, రాంచందర్ గౌడ్, గురడి నర్సారెడ్డి, పులివెంకటేశ్వర్, న్యాస రాజేశ్వర్, డాక్టర్ షాదుల్ల, మురళి, పెద్దోళ్ల శ్రీను, గంగారం, ఇబ్రహీం, పాల్గొన్నారు.

### నాబార్డు నిధులతో
## కల్యాణ మండపం నిర్మించాలని తీర్మానం

నవీపేట, మార్చి1: మండలంలోని బినోల సొసైటీకి చెందిన స్థలంలో నాబార్డు నిధులతో నూతనంగా కల్యాణ మండపం నిర్మించాలని శుక్రవారం సంఘం పాలకవర్గం సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ హన్మాండ్లు మాట్లాడుతూ నాబార్డుకు చెందిన రూ.కోటి వ్యయంతో కల్యాణ మండపం నిర్మాణానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. నూతనంగా నిర్మించిన సొసైటీ భవనంలో సేవింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, బంగారు ఆభరణాలపై రుణాలను అందించాలని తీర్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ బాబర్, కార్యదర్శి రమేష్, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

## పొతంగల్‌లో వృద్ధురాలి అదృశ్యం

కోటగిరి, మార్చి1: పొతంగల్ మండల కేంద్రానికి చెందిన పోశవ్వ అనే 65 ఏళ్ల వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పోశవ్వ గ్రామంలో ఒంటరిగా నివసించేదని పేర్కొన్నారు. గతనెల 25వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు రాగా ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712659878 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

## టీయూలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

డిచ్‌పల్లి, మార్చి1: తెలంగాణ యూనివర్సిటీలో క్రికెట్ టోర్నమెంట్ 5వ రోజూ కొనసాగింది. సెకండ్ సెమీ ఫైనల్ మ్యాచ్ వర్సిటీ పీజీ టీంతో కామారెడ్డి సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల టీం తలపడగా టీయూ పీజీ టీం, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 141 పరుగులు సాధించి జీడీసీ కామారెడ్డి టీంపై గెలుపొంది ఫైనల్‌కు చేరినట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ బాల కిషన్ తెలిపారు. ఈ టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరి బీఆర్ నేతా జూనియర్ అసిస్టెంట్ నరేశ్ పాల్గొన్నారు.

## గోవూరు వాసికి రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు

మోస్రా, మార్చి1: తెలంగాణ గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో మండలంలోని గోవూర్ గ్రామానికి చెందిన సుంకే అరవింద్ కుమార్ రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించారు. పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సైతం అరవింద్ సాధించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఉస్మానియాలో అరవింద్ పీజీ పూర్తిచేశారు. అరవింద్‌కుమార్ మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు సుంకే సుబ్బయ్య, పుష్పలతో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

### నేడు డిచ్‌పల్లిలో
## గృహజ్యోతిని ప్రారంభించనున్న రూరల్ ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, మార్చి1: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేయనున్న గృహజ్యోతి పథకం శనివారం (నేడు) డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి పంచాయతీలో రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి ప్రారంభించనున్నారని మాజీ కోఆప్షన్ మెంబర్, కాంగ్రెస్ ప్రతినిధి శాంసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

# దేశం అభివృద్ధి చెందాలంటే వర్సిటీలదే కీలక పాత్ర

**● టీయూలో వికసిత్ భారత్‌లో విద్యారంగం పాత్రపై సెమినార్**



సదస్సులో మాట్లాడుతున్న డా.కల్పన ప్రవీణ్ పాండె



మాట్లాడుతున్న గుంత లక్ష్మణ్

డిచ్‌పల్లి, మార్చి1: భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగలంటే వర్సిటీలు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ ఉపాధ్యక్షురాలు డా.కల్పన ప్రవీణ్ పాండె అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీలో ఏబీఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో వికాసిత్ భారత్‌లో విద్యారంగం పాత్ర అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు కల్పన ప్రవీణ్ పాండె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ పరిశోధకులు ప్రయోగాలు చేసి 2047లో వరకు భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి కృషి చేయలన్నారు. ఈ సదస్సులో గౌరవ అతిథిగా పాల్గొని కీలక ఉపన్యాసం చేసిన ఏబీఆర్ఎస్ఎం ఆల్ ఇండియా జాయింట్ ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ దేశీయ టెక్నాలజీ అభివృద్ధి చేసి దేశ ఆత్మ నిర్భరతకు పాటు పడాలని అధ్యాపకులు పరిశోధకులకు పిలుపునిచ్చారు. భారతదేశ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో అపూర్వమైన ప్రతిభ చూపి ముందంజలో ఉందన్నారు. పునరుత్పాదక ఇంధనాల అభివృద్ధికి పాటుపడుతూ మౌలిక వసతుల సదుపాయల కల్పనలో అభివృద్ధి సాధిస్తూ దేశం ప్రపంచస్థాయిలో బలమైనదేశంగా అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. దేశంలో ప్రతీ పౌరుడు, విద్యార్థి తానే సైనికుడిగా పనిచేస్తూ దేశ సురక్షిత అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఆత్మనిర్భర భారత్ నుంచి వికసిత్ భారత్‌కు కృషి చేస్తూ భారత్ తన విశ్వ గురువు తిరిగి అందుకోవడానికి సమిష్టి కృషి చేయాలని అన్నారు. అనంతరం ఇంగ్లీష్ అండ్ ఫారన్ లాంగ్వేజెస్ సహాయ ఆచార్యులు డా.కంకట రాజరాం మాట్లాడుతూ దేశం తలసరి ఆదాయం జీవన ప్రమాణాలు విద్య, వైద్యరంగంలో అభివృద్ధి సాధిస్తూ వికసిత్ భారత్‌గా అవతరించలన్నారు. ఈ దిశగా వర్సిటీలు పరిశోధన కేంద్రాలుగా ఇంక్యూబేషన్, స్టాటప్ కేంద్రాలుగా ఎదగాలని అప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని తెలిపారు. వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి మాట్లాడుతూ టెక్నాలజీ పెంపు ద్వారా మానవ వనరుల అభివృద్ధి ద్వారా వికసిత్ భారత్ దిశగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. సెమినార్ సమన్వయకర్తలు డా.వాసం చంద్రశేఖర్, డా.ఎం సత్యనారాయణ, డా.బోయపాటి శిరీష, వ్యవహరించారు. కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య, సీనియర్ ఆచార్యులు అంజనేయులు డీన్ రాంబాబు, సంపత్‌కుమార్, తదితరులు ఉన్నారు.

# మా గ్రామంలో సెల్‌టవర్ వద్దు

**● గోలి లింగాల్ గ్రామస్థుల ఆందోళన**

**● టవర్ ఏర్పాటు కోసం తీసిన గుంతను పూడ్చేసిన గ్రామస్థులు**



గుంతలను పూడ్చుతున్న గ్రామస్థులు

నాగిరెడ్డిపేట, మార్చి1: మండలంలోని గోలి లింగాల గ్రామంలో సెల్‌టవర్‌ను ఏర్పాటును నిరసిస్తూ గ్రామస్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సెల్ టవర్ ఏర్పాటు కోసం గ్రామం వద్ద తవ్విన గుంతలను గ్రామస్తులంతా కలిసి పూడ్చేశారు. గ్రామ తాజా మాజీ సర్పంచ్ మురళి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గోలి లింగాల్ గ్రామంలో ఇప్పటికే ఒక జియో సెల్‌టవర్ ఉందని, ప్రస్తుతం గ్రామంలో ఎయిర్‌టెల్ వారు సెల్‌టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కొన్ని నెలల క్రితమే గ్రామ పంచాయతీ ద్వారా గ్రామంలో గ్రామసభ నిర్వహించి గ్రామంలో ఎలాంటి సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దంటూ గ్రామస్తులంతా తీర్మానం చేశారన్నారు. సెల్‌టవర్ ఏర్పాటు కోసం పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు. గ్రామంలో సెల్‌టవర్‌ల ఏర్పాటుతో వాటి రేడియేషన్లతో పిల్లలు, వృద్ధులు, గర్భిణీల తీవ్ర ఆనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇప్పటికే గ్రామంలో పలువురు పక్షవాతంతో బాధపడుతున్నట్లు తెలిపారు. సెల్‌టవర్ వద్దంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని తెలిపారు. సెల్‌టవర్ ఏర్పాటు విషయమై గ్రామస్థులంతా మూకుమ్మడిగా వ్యతిరేకిస్తూ, గ్రామస్థుల అభిప్రాయాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా సెల్‌టవర్ ఏర్పాటు కోసం సంబంధిత వ్యక్తులు గుంతను తీసేసినట్లు వారు తెలిపారు.

**● ఫిర్యాదుపై అధికారి విచారణ**

గోలిలింగాల్ గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ఇటీవల జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రజావాణి ఫిర్యాదుపై జిల్లా ఉన్నతాధికారులు గ్రామంలో విచారణ జరపాలని మండల పంచాయతీ అధికారికి శ్రీనివాస్‌ను ఆదేశించారు. దీంతో ఎంపీవో శ్రీనివాస్ గ్రామంలో శుక్రవారం విచారణ జరిపారు. గ్రామస్థులతో ఆయన సమావేశమై గ్రామస్థులందరి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దంటూ సెల్‌టవర్ ఏర్పాటు విషయంలో గ్రామస్తులంతా వ్యతిరేకించారు.దీంతో గ్రామస్తులందరి అభిప్రాయాన్ని జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక సమర్పిస్తానని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళి, పంచాయితీ కార్యదర్శులు గంగాధర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌రూరల్, మార్చి1: మండలంలోని చేపూర్‌లో మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌లను శుక్రవారం ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఆవిష్కరించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఐదురోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 5న అగ్గుస్వామి మహరాజ్‌చే ఆశీర్వద తీర్థప్రసాదాలు, 6న కుంకుమార్చన, 7న గణపతిపూజ, పుణ్యహవచనం, స్వామివారి ఊరేగింపు, నగారే డప్పు కళాబృందం వారిచే ప్రదర్శన, 8న శివపార్వతుల కళ్యాణోత్సవం, 9న అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీడీసీ అధ్యక్షుడు రేక్కల గంగారెడ్డి, కోశాధికారి దాసరి నాగరాజులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బద్దంరాజు, సురేష్‌రుక్మాజీ, మాజీఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, మాజీసర్పంచ్ కుస్తపురం గంగారెడ్డి, శ్రీకాంత్, చరణ్, లింగాగౌడ్, శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శన

ఆర్మూర్‌రూరల్, మార్చి1: ఆర్మూర్ పట్టణంలోని నటరాజ నృత్యనికేతన్ విద్యార్థినీలు శుక్రవారం మామిడిపల్లిలోని అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రదర్శించిన నృత్యప్రదర్శనను అందరినీ అలరించాయి. వేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నటరాజ నృత్యనికేతన్ విద్యార్థులకు ప్రత్యేక నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు నాట్యగురువు బాశెట్టి మృణాళిని తెలిపారు. చక్కని నృత్యాలు, అభినయాలతో ఆకట్టుకున్న విద్యార్థినీలకు దేవస్థానం కమిటీ సభ్యులు, విజయ్ విద్యాసంస్థల అధినేత్రి అమృతలత ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకులు మాడవేటి నారాయణ, విజయ్ విద్యసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో
## గురుకుల విద్యార్థులకు బంగారు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోదావరి

డిచ్‌పల్లి, మార్చి1: ఈ నెల 21నుంచి 25 వరకు బీహార్‌లోని పాట్నాలో జరిగిన 41వ జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో కేరళజట్టుపై తెలంగాణ రాష్ట్ర జట్టు 10-9 పరుగుల తేడాతో విజయం సాధించడంతో సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి క్రీడాకారులు గోక సాత్విక, గోక్రశవిక కీలక పాత్ర పోషించి బంగారు పతకాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇద్దరు క్రీడకారులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దీప్తి వాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, ఫిజికల్ డైరెక్టర్‌లత, మౌనిక, అకాడమీక్ కోచ్ మౌనిక పాల్గొన్నారు.

## ఎంఎడ్ 3వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, మార్చి1: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎంఎడ్ రెగ్యులర్ 3వ సెమిస్టర్ పరీక్షలు 3వ రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు 36మంది విద్యార్థులకు గాను 35 మంది పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**● పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షలు ప్రశాంతం**

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల పీజీ 1వ సెమిస్టర్ ఎంఎ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, 5ఏళ్ల ఇంటిగ్రెటెడ్ కోర్సులు ఏపీఈ, ఐపీసీహెచ్,ఐఎంబీఏ, 7వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలు 5వ రోజు ముగిసాయి. శుక్రవారం జరిగిన పరీక్షకు 1,283 మంది విద్యార్థులకు గాను 1205 విద్యార్థులు హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పీజీ పరీక్షలు వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, భిక్కనూరు సౌత్ క్యాంపస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గిరిరాజ్ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ, బోధన్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

**● ఆర్‌బీఐ ఏజీఎం అనిల్ కుమార్**



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎల్‌డీఎం, ఆర్‌బీఐ ఏజీఎం

డిచ్‌పల్లి, మార్చి1: ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్‌నేరాలు అధికమవుతున్నాయని, ప్రతీఒక్కరు సైబర్‌నేరాలపై జాగ్రత్త పడాలని ఆర్‌బీఐ ఏజీఎం అనిల్ కుమార్, ఎల్‌డీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా నడిపల్లి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర ప్రభుత్వ జన సురక్షిత పథకాలు పీఎంజేజేబీఐ, పీఎంఎస్‌బీపై వాటిపై అవగహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలను అందజేయాలని టీజీబీ రీజినయల్ మేనేజర్ నవీన్‌కుమార్, అన్నారు. ఈ సందర్భంగా పీఎంజేజేబీపై, ఎస్‌బీపై లబ్ధిదారులకు రూ.2లక్షల విలువల గల చెక్కులు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ కంట్రోలర్ మురళి మోహన్, బ్రాంచ్ మేనేజర్ పద్మ, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు

**● ఐఆర్ఎస్ అధికారి శేషు**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

రెంజల్, మార్చి 1: విద్యార్థులు పట్టుదలతో చదివితే తమ లక్ష్యాలను చేరుకోవచ్చని ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి శేషు అన్నారు. శుక్రవారం మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తాను చదివిన చదువు, అనుభవాలను వివరిస్తూ విద్యార్థులను చైతన్యపర్చారు. పేదరికం చదువుకు అడ్డుకాదని, తెలివితో అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని అన్నారు. తాను కూడా మారుమూల ప్రాంతమైన సాలూరకు చెందిన వాడినని, ఢిల్లీలో 2016 బ్యాచ్ మెకానికల్ ఇంజనీరింగ్‌గా విద్యాభ్యాసం చేశానని, 2017, 2018లో దేశంలో ఆలిండియా 723వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ జీఎస్పీ ఇంటలిజెంట్ అధికారిగా ఒరిస్సాలో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన విషయాలను శ్రద్ధగా విని చదువులో రాణించినప్పుడే విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. టాలెంట్ అనేది ఎవరి సొత్తు కాదని టాలెంట్ ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన అన్నారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇల్తెపు శంకర్, ఉపాధ్యాయులు అబ్బయ్య, ఆనంద్, శ్రీనివాస్, లావణ్య, సుకృత, కలీం తదితరులు ఉన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

## హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

బోధన్ రూరల్, మార్చి1: పట్టణంలోని నడి ఊరు చావిడి వద్ద నూతన హనుమాన్ ఆలయ విగ్రహప్రతిష్ఠాపనలో భాగంగా రెండోరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. శుక్రవారం రెండోరోజు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. పాడి పంటలు చల్లగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాగారెడ్డి మాట్లాడుతూ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి జగద్గురు శంకరాచార్య, హంపీ విరూపాక్ష, విద్యారణ్య భారతి స్వామి మహా సంస్థానం పీఠాధిపతి హాజరుకానున్నారని పేర్కొన్నారు. విగ్రహప్రతిష్ఠాపన సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్, మార్చి1: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విద్య అన్నారు. ఆదివారం ఉదయం 6గంటలకు అన్నిచోట్ల పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. బోధన్ డివిజన్‌లోని కేంద్రాల పరిధిలో ఉన్న 37,950 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలను వేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ నిర్మలతో పాటు తదితరులు ఉన్నారు.

## రైలు ఢీకొని యువకుడి మృతి

బోధన్‌రూరల్, మార్చి1: ఎడపల్లి మండల కేంద్రంలో రైలు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నిజామాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన శేఖ్ సుభాన్ (30) అనే యువకుడు కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నయాబాద్ ప్రాంతానికి వెళ్లి 11:30 తిరిగి వస్తుండగా చూసుకోకుండా జామా మసీదు దగ్గర పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## నవీపేటలో ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పర్యటన



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న అధికారిణి

నవీపేట, మార్చి1: మండల కేంద్రంలో శుక్రవారం ట్రైనీ ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి పర్యటించారు. మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సరీని పరిశీలించారు. అనంతరం రైతు వేదిక భవనంలో జరిగిన మహిళా సంఘాల సభ్యులతో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల నిర్వహణ, పొదుపు, బ్యాంకురుణాలను పొందే విధానం, రికవరీ, స్వయం ఉపాధి వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నవీపేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయా గౌడ్, ఐకేపీ డీపీఎం నీలిమా, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులున్నారు.

## అమరులకు నివాళి

బోధన్ రూరల్, మార్చి1: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరులకు జోహార్లు అంటూ శుక్రవారం అంబేడ్కర్‌చౌరస్తాలో అమరుల చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంసీపీ జిల్లా సీనియర్ నాయకులు డల్ల సురేష్ మహాజన్, లక్ష్మీగారి భూమయ్య మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏర్పడి 30 ఏళ్లవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా చేస్తున్నాయని అన్నారు. ఎస్సీలలో వర్గీకరణ లేక వైద్య, విద్యా, ఉద్యోగరంగాల్లో మాదిగ, మాదిగ ఉపకులాలు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.సాయిలు, తాడెం అబ్బయ్య, గంగాధర్, గైని రవి, తదితరులున్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న దృశ్యం

## ఉర్దూ అకాడమి చైర్మన్‌గా తాహెర్ బిన్



నిజామాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్‌గా పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్‌ను ప్రభుత్వం నియమించింది. మూడేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఉమర్ జలీల్ ఉత్తర్వులను జారీచేశారు. ఉర్దూ అకాడమి చైర్మన్‌గా ఆయన నియామకం కాగా మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శి, మైనార్టీ సంక్షేమ కమిషనర్, ఉర్దూ అకాడమి డైరెక్టర్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలోని సిరికొండకు చెందిన తాహెర్ బిన్ హందాన్ 40ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. జడ్పీటీసీగా, జడ్పీ చైర్మన్‌గా ఆయన పనిచేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా సుదీర్ఘకాలం పార్టీలో ఉన్నారు. నిజామాబాద్ నుంచి రెండు దఫాలు కాంగ్రెస్ తరఫున ఆయన ఎమ్మెల్యేగా పోటీచేశారు.

## జిల్లా మార్కెట్‌లో పసుపునకు అత్యధిక ధర

● క్వింటా15వేల 182 రూపాయలు

నిజామాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ మార్కెట్‌లో పసుపునకు ధర బాగా పెరిగింది. మార్కెట్‌కు శుక్రవారం తీసుకువచ్చిన బాల్కొండ మండలంలోని వన్నెల్ (బి) గ్రామానికి చెందిన పాలెం పురుషోత్తం అనే రైతు 10క్వాంటాళ్ల పసుపు తేగా క్వింటాలుకు 15వేల 182 రూపాయల ధర పలికింది. మార్కెట్‌కు శుక్రవారం 8500 క్వాంటాళ్ల పసుపు వచ్చింది. మార్కెట్‌లో సరాసరి 8వేల నుంచి 14వేల 500మధ్య పసుపు అమ్మకాలు జరిగాయి. గడిచిన వారం రోజులుగా మార్కెట్‌లో కొత్త పసుపు ధర పెరుగుతుంది. రైతులు కూడా ఎండిన పసుపును తీసుకు రావడం వలన ధర వస్తుందని మార్కెట్ కార్యదర్శి వెంకటేశం తెలిపారు.

## ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం

● నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 1: మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బోర్గాం (పి) చౌరస్తా వద్ద ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి గంధమాల నాగభూషణం ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ ఉద్యమం 1994 జూలై 7న ఏర్పడి నేటికి 30 సంవత్సరాలు అవుతుందని, ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ అలుపెరగని పోరాటం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా పార్లమెంట్ ఎన్నికల్లోపే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీవర్గీకరణ చేపట్టి మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పులాంగ్ చౌరస్తాలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

## పీఏసీఎస్ వైస్‌చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



డొంకేశ్వర్ సొసైటీలో చేతులెత్తిన డైరెక్టర్లు

డొంకేశ్వర్, మార్చి1: మండల ప్రాథమిక సహకార సంఘం పాలక మండలి వైస్‌చైర్మన్ రాజారెడ్డిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఆయనపై అవిశ్వాసాన్ని కోరుతూ సొసైటీకి చెందిన ఏడుగురు డైరెక్టర్‌లు జిల్లా శాఖ అధికారి శ్రీనివాస్‌కు ఇటీవల వినతిపత్రాన్ని అందజేశారు. శుక్రవారం వైస్‌చైర్మన్ ఎన్నికను పోలీసు బందోబస్తుతో డైరెక్టర్ సొసైటీకి చేరుకున్నారు. డైరెక్టర్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చైర్మన్‌తో కలిసి తొమ్మిది మంది సభ్యులు ఓటు వేశారు. శనివారం ఉదయం 10గంటలకు వైస్‌చైర్మన్ ఎన్నికను చేతులెత్తి పద్ధతి ద్వారా నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస ఓటింగ్ సందర్భంగా రూరల్ సీఐ శ్రీధర్, ఎస్సై రాహుల్ బందోబస్తు నిర్వహించారు.

## 'ప్రతి మనిషి రక్తదానం చేయాలి'

పెద్దబజార్, మార్చి 1: ప్రతి మనిషి సంవత్సరానికి ఒకసారి రక్తదానం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని ద్వారకనగర్‌లో గల భువన సమేక ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందూరు బ్లడ్ బ్యాంక్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా ఇందూరు పేరుతో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేసిన యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. 18 ఏళ్ల నిండిన ప్రతి వ్యక్తికి ఓటు హక్కుతో పాటు రక్తదానం బాధ్యతగా తీసుకొని రక్తదానం చేయాలన్నారు. ఈ బ్లడ్‌బ్యాంక్ ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు బ్లడ్ బ్యాంక్ యజమానులు డాక్టర్ దామోదర్‌రావు, వైద్యులు శ్రీశైలం, శివప్రసాద్, వినయ్, ధన్‌పాల్, శ్రీవానిధన్‌పాల్, రాఘవేంద్ర, స్రవంతి, బీజేపీ నాయకులు ప్రభాకర్, బైకాన్ మధు, తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ సిబ్బందికి సన్మానం

నిజామాబాద్ లీగల్, మార్చి 1: పదవీ విరమణ చేసిన సిబ్బందిని సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం తన కార్యాలయంలో పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న సాయన్నరావును సన్మానించారు. తన సర్వీసులో ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఉద్యోగికి ఎంతో గొప్ప విషయమని తెలిపారు. డిపార్ట్‌మెంట్‌లో ఇన్నాళ్ల సేవలు చేసినందుకు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఆర్ఐ వెంకట్, రమేష్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, కంపెనీ కమాండర్ సయ్యద్ బషీర్ అహ్మద్, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి ఎంపీ అర్వింద్‌కు లేదు



మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్, గడుగు, కేశవేణు

నిజామాబాద్ అర్బన్, మార్చి 1: కాంగ్రెస్ పార్టీపై ఎంపీ అర్వింద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసే స్థాయి అర్వింద్‌కు లేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర అధ్యక్షుడు కేశవేణులు అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పదేళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ సంపదను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలను మూసివేసిందని, లక్షలాది మంది ఉద్యోగులను రోడ్డున పడేసిందన్నారు. 2018లో పార్లమెంట్ ఎన్నికలకు ముందు బోధన్ నుంచి మెట్‌పల్లి వరకు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చెరకు రైతులకు మాట ఇచ్చి పాదయాత్ర చేసిన అర్వింద్ ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంతో కానీ రాష్ట్ర ప్రభుత్వంతో కానీ ఏ రోజు కూడా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడలేదన్నారు. పసుపు రైతులకు ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసి ఇచ్చిన విధంగా పసుపు బోర్డు ఎందుకు తీసుకురాలేదని కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి అబద్ధాలు చెబుతూ ఎంపీ పూటకో మాట మాట్లాడుతున్నారని, పసుపు ధర 14వేలు పలకడం తమవల్లేనని చెబుతుండడం హాస్యాస్పదమన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పసుపు 17వేలు ధర పలికింది నిజం కాదా ఇది ఎంపీ అరవింద్‌కు తెలియదా అన్నారు. కాంగ్రెస్ పార్టీని తిట్టడం, ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేయడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో నాయకులు రత్నాకర్, భక్తవత్సలం, వేణురాజ్, విపుల్‌గౌడ్, జావెద్ అక్రమ్, మీసాల సుధాకర్‌రావు, కేశమహేష్, గంగారెడ్డి, రాంభూపాల్, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయండి

● రాహుల్‌గాంధీని కోరిన ఇండియన్ ఓవర్సీస్ నాయకులు



రాహుల్‌గాంధీతో ఇండియన్ ఓవర్సీస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 1: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ యువత నేత రాహుల్‌గాంధీని జిల్లాకు చెందిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు కోరారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం లండన్ వెళ్లిన రాహుల్ గాంధీని ఇండియన్ ఓవర్సీస్ యూకే శాఖ ఉపాధ్యక్షుడు రంగుల సుధాకర్‌గౌడ్, గంప వేణుగోపాల్‌లు కలిసి తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరారు. తెలంగాణ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేయడం ద్వారా ఆ ప్రభావం తెలంగాణతో పాటు దక్షిణ భారత దేశంపై పడుతుందని కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకునే అవకాశం కలుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కల నాయకత్వంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికలో తెలంగాణలో అన్ని స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. వారి విజ్ఞప్తిని రాహుల్‌గాంధీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

### లండన్‌లో రాహుల్‌గాంధీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఇందల్వాయి: లండన్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన ఇందల్వాయి కళ్యాణ్‌రెడ్డి రాహుల్‌గాంధీని ప్రత్యేకంగా కలిసి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ సమస్యల గురించి చర్చించినట్లు తెలిపారు. రూరల్‌లో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి వివరించి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. లండన్ పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీ హుందాతనం చూసి యువకులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని రాహుల్‌గాంధీ దేశప్రధాని కావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన యువకులు ఉన్నారు.



వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

## గిరిజన కళాశాల వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, మార్చి 1: నగరంలోని నాందేవ్‌వాడలోగల గిరిజన కళాశాల వసతి గృహాన్ని శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో భోజనం, మంచినీరు, బాత్‌రూమ్, ఇతర సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హాస్టల్‌లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేగా ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వివరించారు. భోజనం సరిగా పెట్టడం లేదని మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, బాత్‌రూమ్, మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, సుధీర్, ప్రవళిక, తదితరులు ఉన్నారు.

## మహాసభను జయప్రదం చేయండి

పెద్దబజార్, మార్చి 1: మూడవ విప్లవపార్టీల విలీనం సందర్భంగా జరిగే ఐక్యత మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ నగర కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 3, 4, 5 తేదీలలో ఖమ్మంలో జరిగే మూడు విప్లవ పార్టీల ఐక్యతను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశ పెట్టుబడి దారి విధానం ఇప్పుడే సవాళ్లను అధిగమించడానికి కమ్యూనిస్టు విప్లవ ఉద్యమం సైతం మార్పులు చేసుకోవాల్సి ఉందన్నారు. 14 రాష్ట్రాలల్లో వివిధ స్థాయిలలో పనిచేసే సీపీఐఎంఎల్ ప్రజాపంథ పీసీసీ, సీపీఐఎంఎల్ ఆర్ఐ మూడు పార్టీలు కలిసి చర్చించుకొని ఒక అవగాహన ఏర్పర్చుకొని ఐక్యం కావాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న మేనేజర్

## ఎస్టీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

డొంకేశ్వర్, మార్చి1: డొంకేశ్వర్ కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే ఎస్టీ విద్యార్థులకు అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి చదువులో ముందున్న విద్యార్థులకు ఈ ప్రోత్సాహకాన్ని సీఎస్ఆర్ యాక్టివిటి కింద విద్యార్థినులు స్ఫూర్తి, కీర్తన, శ్రీ విద్యలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేసినట్టు బ్యాంకు మేనేజర్ మారుతిగౌడ్ తెలిపారు. అలాగే ప్రీ ఫైనల్ పరీక్షకు సిద్ధమవుతున్న 82మంది పదో తరగతి విద్యార్థులకు చిలుకురి బాలాజీ ఆలయంలో పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్‌కుమార్ పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కుమార్, సదానంద్, రాజేశ్వర్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ఎంప్లాయిస్‌ను విధుల్లోకి తీసుకోవాలి

పెద్దబజార్, మార్చి 1: ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న ఎంప్లాయిస్‌ను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ ఆఫీసర్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందని అన్నారు. జిల్లాలో పది మందికి రాత్రికి రాత్రి డ్యూటీలను ఆపివేయడం తీవ్ర ఆందోళనకు చెందారన్నారు. కొవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి కుటుంబాలకు దూరంగా ఉంటూ అనేక రకాలుగా సేవలు అందించారని ఉద్యోగంలో ఎన్ని ఆటంకాలు వచ్చిన పనిచేశామన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పర్మినెంట్ నర్సింగ్ ఆఫీసర్ల స్థానంలో పని చేసిన వీరిని తొలగించడం అన్యాయమని వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్టు పద్ధతిలో అందరిని యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంధ్యారాణి, శకుంతల, దివ్య, రేవతి, శ్రీలత, షెహ్మబేగం, తదితరులు పాల్గొన్నారు.

## తండాల అభివృద్ధికి నిరంతరం కృషి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఫిబ్రవరి 27: గిరిజనులు ప్రకృతితో మమేకం అవుతూ ఉపాధి పొందుతారని వారి అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కల్లెడి గ్రామంలో సంత్‌సేవలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. సేవలాల్ మహరాజ్ విగ్రహానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి రాకేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని మామిడిపల్లి గ్రామశివారులో గల అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఇంటర్ పరీక్షల్లో ఒకరు డిబార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 1: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలో ఓ విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడుతుండగా అధికారులు మాల్‌ప్రాక్టిస్ కేసు నమోదు చేశారు. మొత్తం 57 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 18వేల 66 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 17వేల 402 మంది విద్యార్థులు హాజరుకాగా 664 మంది గైర్హాజరయ్యారు. డీఐఈవో రఘురాజ్ 4 పరీక్షా కేంద్రాలను, డీఈసీ కమిటీ 8, హెచ్‌పీసీ 7, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 32 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

డొంకేశ్వర్, మార్చి1: డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం పక్కా సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.12వేల170 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జరిమానా

నిజామాబాద్ లీగల్, మార్చి 1: మద్యం తాగి వాహనం నడిపిన ఎనిమిది మందికి మెజిస్ట్రేట్ సయ్యద్ 7,800 రూపాయల జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందిని ట్రాఫిక్ ఎస్సై వెంకటరమణ శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు వారికి 7,800 రూపాయల జరిమానా విధిస్తూ పంగేరి యాదగిరికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు.

## నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, మార్చి 1: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్-1, 2, 3 ఏడీఈలు చంద్రశేఖర్, తోటరాజశేఖర్, వీరేశంలు తెలిపారు. నగరంలోని తిలక్‌గార్డెన్, పవర్ హౌజ్, వినాయక్‌నగర్, బోర్గాం, అర్సపల్లి, దుబ్బ, మిర్చికంపౌండ్, సుభాష్‌నగర్, గూపన్‌పల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రేపు జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపికలు

సుభాష్‌నగర్, మార్చి 1: జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపికలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి భూలోకం విజయ్ కాంత్‌రావు తెలిపారు. బాలురు అండర్-14, 16, 18, బాలికలు 14, 16, 18 పురుషుల, మహిళల విభాగంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, బోనాఫైడ్‌తో హాజరుకావాలని, మిగతా వివరాల కోసం 9912883331 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## ఒకటవ తేదీన ఉద్యోగులకు జీతాలపై హర్షం

నిజామాబాద్ అర్బన్, మార్చి 1: ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలు చెల్లించి మాటనిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్‌లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయిన ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటవ తేదీనే జీతాలు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల తరఫున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## ఘనంగా వెంకటేశ్వరస్వామి చక్రతీర్థం

జక్రాన్‌పల్లి, మార్చి 1: జాతర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అర్గుల్ గ్రామంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివారి చక్రతీర్థం జరిగింది. శనివారం నాగవెల్లితో జాతర ఉత్సవాలు ముగుస్తాయని వేదపండితులు ఆచార్య తేజ చక్రవర్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ గోర్త పద్మ, మాజీఉపసర్పంచ్ గోర్త రాజేందర్, ఎంపీటీసీ అనిత, వీడీసీ చైర్మన్ రాజారెడ్డి, కోఆశాధికారి మురళీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోపై సిబ్బందికి శిక్షణ

నందిపేట, మార్చి 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పల్స్ పోలియోపై సిబ్బందికి మండల వైద్యాధికారి ప్రవీణ్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 3న జరగనున్న నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అనే నినాదంతో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. 5సంవత్సరాల లోపు పిల్లలకు మాత్రమే రెండు మందు వేయాలని, 3,4 తేదీలలో ఇంటింటికి తిరిగి 100శాతం పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్, సూపర్ వైజర్లు మేరీ, సుజాత, భాస్కర్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం

మెండోర, మార్చి1: జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి చరణ్‌తేజ్ ప్రథమ స్థానంలో నిలిచాడని ప్రిన్సిపాల్ తారసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్య గణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమం పౌరుల పాత్ర అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొని చరణ్ తేజ్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. అనంతరం చరణ్‌తేజ్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మోపాల్, మార్చి 1: మండలంలోని రాణాకుర్తి గ్రామంలో శుక్రవారం ఎన్ఆర్‌జీఎస్ కింద మంజూరైన 5లక్షల రూపాయలతో గ్రామంలో సీసీ రోడ్డు పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యరెడ్డి ప్రారంభించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కొన్ని రోజులు అవుతున్నా గ్రామాల్లో పనులు మాత్రం వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

నందిపేట, మార్చి1: మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమి పూజ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5లక్షలు మంజూరైనాయని, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆర్మూర్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భైండ్ల ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కండెల నరేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నంగి గంగాధర్, సీనియర్ నాయకులు మంగ్లారం తుక్కన్న, సొసైటీ డైరెక్టర్ తోట మహేష్, ఎస్సీ మాదిగ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.